క్లుప్తంగా

ముక్కామల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

పెరవలి: మండలంలోని ముక్కామల గ్రంథాలయంలో సోమవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ ముక్కామల శాఖ మేనేజర్ బి.చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎవరు ఎక్కువ విజ్ఞానవంతులో వారే నేటి పోటీ ప్రపంచంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారన్నారు. అలాంటి విజ్ఞానం లభించే చోటే గ్రంథాలయాలు అన్నారు. గ్రంథాలయాల సేవలను వినియోగించుకుని, విద్యార్థులు వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కడియాల సాయిరామ్, ఎస్‌వీ సూర్యనారాయణ, కరుటూరి విశ్వనాథం, మద్దిపాటి సత్యం, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకరపర్రులో 123 మందికి సుగర్ పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెరవలి: బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కాకరపర్రు గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 123 మంది సుగర్ వ్యాధిగ్రస్తులకు రక్త, యూరిన్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గారపాటికి పలువురి పరామర్శ

కొవ్వూరు: మండలంలోని పశివేదల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గారపాటి శ్రీనివాసరావును పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి రామచంద్రరావు (చిలకయ్య) మృతి చెందారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు), ఏఎంసీ మాజీ చైర్మన్లు వేగి చిన్నా, ఆళ్ల హరిబాబు, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, వైస్సార్ సీపీ నాయకులు గారపాటి శ్రీనివాస్, పరిమి సోమరాజు, ఉప్పులూరి రాజబాబు తదితరులు ఉన్నారు.

నేడు సీహెచ్ పోతేపల్లిలో గడప గడపకూ..

దేవరపల్లి: ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ద్వారకా తిరుమల మండలశాఖ అధ్యక్షుడు ప్రతాపనేని వాసు తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్తు సరాఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం: వార్షిక మరమ్మతుల నిమిత్తం పెరవలి విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని మల్లేశ్వరం ఫీడర్‌లో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు. కావున అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, ఖండవల్లి, కడింపాడు, మల్లేశ్వరం గ్రామాల విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్యకర్తలందరూ సభ్యత్వాలు తీసుకోవాలి

నల్లజర్ల: కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా జనసేన పార్టీ ముందుకు సాగుతుందని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త డి.సువర్ణరాజు అన్నారు. స్థానిక ఉన్నమట్ల కాంప్లెక్స్‌లో సోమవారం ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వలంటీర్ విధానంలో సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. ప్రమాదవశాత్తూ గాయపడిన, మృతి చెందిన కార్యకర్తలకు ఈ సభ్యత్వం ద్వారా వచ్చిన ప్రీమియం రూ.5 లక్షలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చోడసాని బాపిరాజు, రుద్రా శ్రీను, పిల్లి కాంతారావు,యర్రా బాలాజీ, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, పోలినాటి రాజేంద్ర, కాట్నం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

నిడదవోలు: టీడీపీ పట్టణ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, పార్టీ నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండల శాఖల అధ్యక్షులు వెలగన సూర్యారావు, సింహాద్రి రామకృష్ణ, కె. రామకృష్ణ, టీడీపీ పట్టణ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, కోమట్లపల్లి సుబ్బారావు, సింహాద్రి రామకృష్ణ, భూపతి రాజురవివర్మ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దీవెన

- ఉన్నత చదువులకు ప్రోత్సాహం
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- వసతి, భోజన ఖర్చుల కోసం ఏటా రూ.20 వేల చొప్పున అందజేత



ఎస్వీడీ ప్రభుత్వ మహిళా కళాశాల్లో విద్యార్థినులకు జగనన్న విద్యా దీవెన నమూనా చెక్కు అందిస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు (ఫైల్)

నిడదవోలు: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా లక్షలాది మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఇంజినీర్లు, డాక్టర్లుగా స్థిరపడ్డారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండడుగులు ముందుకు వేసి పేద విద్యార్థుల పై చదువుకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను కూడా అమలు చేస్తున్నారు. విద్యార్థుల వసతి, భోజన ఖర్చుల కోసం ఏడాదికి రూ.20 వేల చొప్పున వారి తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తోంది. జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఏటా రెండు వాయిదాల్లో రూ.20 వేల వరకూ వసతి, భోజన, రవాణా సదుపాయాల కోసం తల్లుల ఖాతాలో ప్రభుత్వం ఈ మొత్తాన్ని జమ చేస్తోంది. నిడదవోలు నియోజకవర్గంలో గత మూడేన్నరేళ్లుగా జగనన్న విద్యాదీవెన పథకంలో 54,287 మంది విద్యార్థులు రూ.38.89 కోట్ల మేర లబ్ధి పొందారు. అలాగే నియోజవర్గంలో జగనన్న వసతి దీవెన పథకంలో భాగంగా ఏటా 5,434 మంది విద్యార్థులకు ఇప్పటి వరకు రూ.15.41 కోట్లు ప్రభుత్వం అందించింది.

నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలిలా ..

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	విద్యాదీవెన సాయం (రూ.కోట్లలో)
2019–20	16,206	11.72
2020–21	16,305	11.73
2021–22	16,305	11.72
2022–23	5471(తొలి విడత)	3.72

రూ.50 వేల మేర లబ్ధి పొందాను



పేదల ఉన్నత చదువుల కోసం జగనన్న వసతి దీవెన కింద ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేల చొప్పున అందించడం ఆనందంగా ఉంది. నాన్న తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాలాంటి పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటోంది. నేను ఇప్పటి వరకూ రూ.50 వేల మేర లబ్ధి పొందాను. ఉన్నతోద్యోగం సాధించాలనే పట్టుదలతో చదుతున్నాను. నాన్న అభీష్టాన్ని జగనన్న ద్వారా నెరవేర్చుకుంటాను.

–పి. గాయత్రి, బీకాం తర్డియర్, ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిడదవోలు

జగనన్న మేలు మరిచిపోలేం



ప్రభుత్వ కళాశాలల్లో మధ్య తరగతి విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటున్నారు. పరీక్ష ఫీజులు, ట్యూషన్ ఫీజులు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా ఫీజులు, భోజన వసతులకు రూ.20 వేల ఆర్థిక సహకారం అందించడం హర్షనీయం.

–పి. లీల, బీకాం సెకండియర్, ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిడదవోలు

సమాజంలో మార్పు కోసం సీఎం తపన



విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి సమాజంలో మార్పు కోసం సీఎం జగన్ పడుతున్న తపన అభినందనీయం. మాలాంటి పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు జగన్ సార్ కొండంత అండగా నిలుస్తున్నారు. మా నాన్న లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. జగనన్న కల్పిస్తున్న ఆర్థిక సాయం నా ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

–షేక్. భాను, బీకాం సెకండియర్, ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిడదవోలు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్‌లోకి చేరిన కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే తలారి, జీవీ

గోపాలపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు టీడీపీ మహిళా కార్యకర్తలు తెలిపారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో సోమవారం గోపాలపురంలోని పెద్దగూడేనికి చెందిన వార్డు మాజీ సభ్యురాలు పసలపూడి నాగమణి, పోసిబోయిన రత్నకుమారి, ఇండిగ కళ్యాణి, కొడవటి అఖిల, జొన్నకూడి సంధ్యారాణి, దాసరి రమేష్‌లు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మాజీ కన్వీనర్ ఎస్‌కే ఖాదర్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు జగనన్న బాటలు

- హోం మంత్రి తానేటి వనిత
- కుమారదేవంలో గడప గడపకూ..



కుమారదేవం గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్రంలో మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని కుమారదేవంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు విడతల వారీగా రుణమాఫీ, సున్నా వడ్డీ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చేయూత పథకం ద్వారా 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఏడాడికి రూ.18 వేల చొప్పున, కాపు నేస్తం ద్వారా కాపు మహిళలకు రూ.15 వేల చొప్పున, ఈబీసీనేస్తం పేరుతో అగ్రవర్ణాల్లోని పేద మహిళలకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. అక్కచెల్లెమ్మల పేరుతో ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. మహిళ రక్షణ కోసం దిశ యాప్‌ను తీసుకొచ్చారని, ఇంతవరకూ రాష్ట్రంలో ఈ యాప్ ద్వారా 900 మంది మహిళలను కాపాడ గలిగామన్నారు. కరోనా విపత్తులోనూ ఏ ఒక్క సంక్షేమ పథకానికి కోత విధించకుండా ఇచ్చిన మాట ప్రకారం అన్నీ సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. అనంతరం మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఏయే కుటుంబానికి ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కర మార్గాలు చూపిస్తూ ముందుకు కదిలారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, కుమారదేవం సర్పంచ్ కాసాని దుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు యండపల్లి నటరాజరాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు గన్నమని వీరవెంకట్రాజు (రాజు), గోలి శ్రీనివాస్, గోరిజాల పేర్రాజు, కోడూరి సత్యనారాయణ, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, నక్కా చిట్టిబాబు, పరిమి వెంకట్రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదవాలి

నిడదవోలు రూరల్: విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని ఎంపీడీఓ టి.మూర్తిబాబు సూచించారు. మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై అవగాహన సదస్సులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మూర్తిబాబు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు బాటలు వేసుకోవాలన్నారు. పరీక్షలు ముగిసేవరకు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంటే మంచిదని సూచించారు. ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎలక్ట్రీషియన్ కడిమి ప్రేమ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఎలక్ట్రీషియన్ల సంఘ మండల శాఖ సభ్యు లు రూ.32,000 ఆర్థిక సాయం అందజేశారు. ప్రేమ్‌కుమార్ కుటుంబ సభ్యులను సంఘ సభ్యులు సోమవారం పరామర్శించి ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బీఎస్ఆర్ కృష్ణ, ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి బాబూరావు, సహాయ కార్యదర్శి వీరబాబు, కోశాధికారి జె.సత్యనారాయణ, మునికోటి నాగరాజు, గౌరవాధ్యక్షులు ఏవీ రామకృష్ణ, వేణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులకు పరిహారాలివ్వాలి

నిడదవోలు: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి నిధులను దారి మళ్లించిన పాలకులు వెంటనే కార్మికులకు వివిధ ఆర్థిక పరిహారాలను విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు పామర్తి సత్యనారాయణ కోరారు. అభ్యుదయ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని సోమవారం పట్టణంలోని ఇందిరానగర్ నిర్వహించారు. అనంతరం అభ్యుదయ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ నూతన అధ్యక్షుడిగా నూతంగి రమేష్, ఉపాధ్యక్షుడిగా గుంటు జగదీష్, కార్యదర్శిగా యెల్లమిల్లి ప్రసన్న, సంయుక్త కార్యదర్శిగా నందిగోళ్ళ మహేష్, కోశాధికారిగా యలగాడ రాజ్‌పాల్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్, రవ్వ సురేష్‌కుమార్, యెల్లమిల్లి వరప్రసాద్, వి.రాజ్‌కుమార్, షేక్ ఖాదర్, గుంటూరు రాజీవ్, ఎమిలి కార్తిక్, వారా ప్రసాద్, కారంపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

నిడదవోలు రూరల్: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపట్టినట్లు తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. నిడదవోలు మండలం కోరుపల్లి, పెండ్యాల గ్రామాల్లో డ్రోన్లతో భూ సర్వేను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగరాజు మాట్లాడుతూ తిమ్మరాజుపాలెంలో తొలివిడతలో సర్వే చేపట్టామని, ఇప్పటి వరకూ 9 గ్రామాల్లో డ్రోన్ల సర్వే పూర్తిచేశామని చెప్పారు. కచ్చితమైన సర్వేతో రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కారింకి అన్నవరం, గుత్తుల నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగారావు, సొసైటీ అధ్యక్షుడు నాగరాజు, రీసర్వే డీటీ ఎం.నాగలక్ష్మి, మండల సర్వేయర్ పి.దిలేశ్వరరావు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చాగల్లు మండల సమావేశం

చాగల్లు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 7వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ వీరాస్వామి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.రాంప్రసాద్ సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు,సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

లబ్ధిదారులకు ఇళ్లపట్టాల పంపిణీ

చాగల్లు: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చంద్రవరం గ్రామంలో దరఖాస్తు చేసుకున్న 20 మంది లబ్ధిదారులకు సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో చంద్రవరం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు బండి అశోక్‌బాబు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

ఉండ్రాజవరం: ప్రజలు తమ ఆధార్ కార్డుల మార్పులు చేర్పుల కోసం మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఏ.శ్రీనివాసు సోమవారం కోరారు. వేలివెన్ను–1 సచివాలయం వద్ద మంగళవారం, పసలపూడిలో బుధవారం, పాలంగిలో గురువారం, మోర్త–1 సచివాలయం వద్ద ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పక్కనే జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

గోపాలపురం: విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసే అంబేడ్కర్ విగ్రహం పక్కనే బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పక్కనే అంతే ఎత్తులో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సామాజిక మార్పు కోసం పనిచేసిన ఇద్దరూ రెండు కళ్లు వంటి వారని ఆయన న్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టింది టీడీపీ అధినేత చంద్రబాబు అని ఆరోపించారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకటరాజు, శెట్టి సుజన్‌రావ్, జిల్లా అధ్యక్షుడు పత్తిపాటి రాంబాబు పాల్గొన్నారు.

సంఘాలన్నీ సేవా కార్యక్రమాలకే..

నల్లజర్ల: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, పాస్టర్స్ ఫెలోషిప్ సంఘాలు రెండూ వేర్వేరు కాదని, అవి పరస్పరం అనుబంధ సంఘాలేనని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కోడే మోజేష్‌బాబు అన్నారు. వాటి లక్ష్యాలన్నీ సేవా కార్యక్రమాలే అని ఆయనన్నారు. మండలం అచ్చన్నపాలెంలోని బేతేలు ప్రార్థనా మందిరంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన గోపాలపురం డివిజన్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోజేష్‌బాబు మాట్లాడుతూ సహోదరులంతా ఐక్యతతో ఉండాలన్నారు. మనమంతా కలసి పనిచేయడానికి ఒక వేదికగా ఈ కమిటీలు ఉండాలన్నారు.ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవడానికి, తోడ్పాటు అందించడానికి జిల్లా కమిటీ ఎపుడూ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.సుకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంబాబు, కోశాధికారి జోషి, ఏఐసీసీ గోపాలపురం డివిజన్ అధ్యక్షుడు శామ్యూల్ రాజు, కార్యదర్శి ఎం.యోబు, రీజియన్ చైర్మన్ గఫార్, జాయింట్ కన్వీనర్ తానేటి రాజు, ముంగమూరి ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో గోపీకి స్వర్ణ పతకం



ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన గోపీనాగరాజు

దేవరపల్లి: విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండస్ట్రియన్‌లో ఈ నెల 3,4,5 తేదీల్లో నిర్వహించిన ఆరో ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో కుమిటి విభాగంలో దేవరపల్లి మండలం గౌరీపట్నంకు చెందిన అరిగెల గోపీనాగరాజు (గోపీ) స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ పోటీల్లో 12 దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నట్టు తెలిపారు. 2015 నుంచి ఇప్పటి వరకూ తాను ఏడు ఇంటర్నేషనల్స్, 35 నేషనల్, 177 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించినట్టు వివరించారు. 2015లో నిర్వహించిన ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో స్వర్ణపతకం సాధించినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం గోపీ పోలీస్ శాఖలో నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా పనిచేస్తున్నారు.

వైభవంగా విజయ గణపతి కల్యాణం

కొవ్వూరు: వేములూరు గ్రామంలోని విజయ గణపతి ఆలయంలో స్వామివారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు.ఉదయం స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన కొవ్విడి శివ శ్రావణి దంపతుల చేతుల మీదుగా స్వామివారికి సిద్ధి,బుద్ధి అమ్మవార్లతకల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మిడి సోమశేఖర్, తమ్మిరిసి ఆదినారాయణ, తుమ్మిడి ఆంజనేయులు, మేడూరి జ్యోతి ఆనంద్‌కుమార్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోష్పాదేశ్వరునికి పూజలు

మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు,బిల్వార్చన, లలితాదేవికి సామూహిక కుంకుమార్చనలు, రుద్రహోమం నిర్వహించారు.ఆయల అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి పూజలను పర్యవేక్షించారు.

పేకాడుతున్న 14 మంది అరెస్టు

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను, ఉండ్రాజవరం గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఉండ్రాజవరం పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఎస్సై కె.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పేకాడుతున్న 14 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.47,700 నగదు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పథకాల లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమావేశాలు



ద్వారకాతిరుమల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ద్వారకాతిరుమల: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమష్టిగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాల లబ్ధిని, వైఎస్సార్ సీపీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే తలారి దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా చేకూరుతున్న లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. జీవీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయికి అందేలా చూడాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉందన్నారు. కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు, న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల సచివాలయ కన్వీనర్ డీజే రాజు, బొండాడ వెంకన్నబాబు, ఉక్కుర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగండి

గోపాలపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ సమావేశానికి మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ 2024లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలను మనం నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, రాష్ట్ర క్రీడల డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.